# సేవాభావాన్ని అలవర్చుకోవాలి

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంఎల్సీ మహేందర్ రెడ్డి

**వికారాబాద్, మే 11(ప్రజా స్వరం):**
మానవసేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఆదివారం ఏ ఎస్ జి ఎం కె ట్రస్టును చైర్మన్ ఆయన ప్రారంభించారు. యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉచిత వైద్య, కంటి పరీక్షల శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సంపాదించడం కాదు సంపదనలో కొంత నిరుపేదలు, అభాగ్యులు దురదృష్టం కొద్దీ ఆపదలో ఉన్న పేదలను ఆదుకునే సేవాభావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఇటీవల కాలంలో తాండూరులో సేవా భావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముజీబ్ ఖాన్ ను ఆయన అభినందించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దైవభక్తి, ప్రభుభక్తి భావంతో విశ్వమానవ కళ్యాణం కోసం తపించాలని ఆయన సూచించారు. ముజీబ్ ఖాన్ మాట్లాడుతూ అనవసర విమర్శలు ఆరోపణలు తదితరులు వదిలి మానవ సేవ కోసం నిస్వార్థంగా ప్రతి ఒక్కరు ఆలోచించాలని తెలిపారు. తాండూరులో గత మూడు దశాబ్దాలుగా నిస్వార్ధంగా ప్రతి పేదలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న మహేందర్ రెడ్డిని ఆయన అభినందించారు. మహేందర్ రెడ్డి సహకారంతో తాండూరులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. సీనియర్ నాయకుడు పిసిసి నేత కరణం పురుషోత్తం రావు మాట్లాడుతూ అభినందనీయమని వివరించారు. అబ్దుల్ రఫ్ మాట్లాడుతూ శివ కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. డాక్టర్ సంపత్ మాట్లాడుతూ మరింత నిర్వహించేందుకు తాము సహకరిస్తామని అన్నారు. అబ్దుల్ రఫ్, గడ్డల రవి, భగవాన్, బీర్కుట్ రఘు, శివానంద్, అగనూరు సంకేత్, తేల్ అబ్దుల్లా, మసూద్, గఫూర్ పాషా తదితరులు ఆయనతో ఉన్నారు.






## అటవీ ప్రాంతంలో కుళ్ళిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

**నార్సింగి, మే 11 (ప్రజా స్వరం) :**
మండల పరిధి లోని నర్సంపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి శవం కుళ్లిన స్థితి లో లభ్యమైంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నర్సంపల్లి గ్రామానికి చెందిన జెగ్గరి చంద్రం వ్యవసాయ వృతి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనులు లేనప్పుడు సమీపం లోని అటవీ ప్రాంతంలో బీడీల కొరకు తునికి ఆకును తెంపి తెచ్చుకుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గం లకు గ్రామానికి చెందిన బొమ్మగారి ప్రభాకర్, బొమ్మగారి స్వామి తో పాటు తునికి ఆకు కొరకు గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతానికి బయలుదేరారు. మధ్యాహ్నం 3 గం లకు వారికి గుర్తు తెలియని వ్యక్తి శవం కుళ్లిన స్థితి లో కనబడింది. విషయాన్ని స్థానిక పోలీసులకు తెలుపగా స్థానిక ఎస్ఐ సిబ్బంది తో పాటు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరీక్షించారు. లభించిన గుర్తు తెలియని శవం పురుషుడిది అని, పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని, మతిస్థిమితం లేక అటవీ ప్రాంతంలో సంచరిస్తూ అనారోగ్యం తో దాదాపు నెల క్రితం చనిపోయినట్లు తెలుస్తుందని అన్నారు. మృతుని వయస్సు 50 నుంచి 60 సం ఉంటుందని, నీలి రంగు, ఎర్ర డబ్బాల డిజైన్ తో ఫుల్ షర్ట్, ఆకుపచ్చ రంగు లుంగీ, లేత గులాబి రంగు బనీను ధరించి ఉన్నాడని, నడుము కు రెండు వరుసల నల్లని రంగు మొలతాడు ఉందని, తల వెంట్రుకలు నలుపు తెలుపు రంగులో ఉండగా, తెల్ల వెంట్రుకల గడ్డం మీసాలు తో శవం ఉందని తెలిపారు. జెగ్గరి చంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ కోరారు.

## నేడు వికారాబాద్ జిల్లాలో మంత్రి పర్యటన

**వికారాబాద్, మే 11(ప్రజా స్వరం) :**
జిల్లాలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సోమవారం పర్యటన సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారుల సూచించారు. సోమవారం పరిగి, వికారాబాద్ లలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ పర్యటనలో భాగంగా చేపట్టాల్సిన వివిధ అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆదివారం మధ్యాహ్నం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను వివరిస్తూ మొదటగా మంత్రి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు పరిగి పట్టణ కేంద్రంలో వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందని అనంతరం మధ్యాహ్నం వికారాబాద్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వైద్య అధికారులతో ఆసుపత్రుల పనితీరు, సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రారంభోత్సవం గావిస్తారని కలెక్టర్ తెలిపారు. టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన



ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.27 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి

## నేడు శంకుస్థాపన

**వికారాబాద్, మే 11(ప్రజా స్వరం) :**
పరిగి పట్టణం నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పరిగి పట్టణంలో రూ .27కోట్ల తో అత్యాధునిక వసతి సౌకర్యాలతో 30 పడకల ఆసుపత్రి నుండి 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచుట కొరకు ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి సోమ వారం



ఉదయం 11 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ,కుటుంబ సంక్షేమం,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా , స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటిస్తారని తెలిపారు.